

వరుస సెలవులతో ట్రాఫిక్ జామ్

హోసూరు, జూన్ 15: వారాంతంతో పాటు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో హోసూరు జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసింది. శని, ఆదివారాలతోపాటు బక్రీద్ సందర్భంగా సోమవారం కూడా సెలవు ఉంది. సరిహద్దులోని అత్తిబెలె చెక్‌పోస్ట్ నుంచి జూజువాడి వరకు వాహనాలు బారులు దీరాయి. ట్రాఫిక్‌జామ్‌తో బస్సుల్లో ప్రయాణించేవారు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు గంటల తరబడి వేచి ఉన్నారు. ఈ నేపథ్యంలో సిప్‌కాట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ ఆధ్వర్యంల్లో పది మందికి పైగా బృందాలు సిప్‌కాట్ ఫ్లైఓవర్ ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రించడంలో నిమగ్నమయ్యారు.

ముగ్గురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ
రాజీనామా

- ఎంపీలుగా ఎన్నికైన కుమారస్వామి, బొమ్మై, తుకారాం
- ఎమ్మెల్సీ కోట శ్రీనివాస పూజారి కూడా..



కేంద్రమంత్రి కుమారస్వామిని సత్కరిస్తున్న సభాపతి బసవరాజ హొరట్టి



రాజీనామా లేఖను స్పీకర్ యూటీ ఖాదర్‌కు అందజేస్తున్న బసవరాజ్ బొమ్మై

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో జరిగిన మార్పుల కారణంగా ఎమ్మెల్యే పదవులకు ముగ్గురు కీలక నేతలు రాజీనామా చేశారు. చెన్నపట్టణ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ఏడాదిపాటు జేడీఎస్ పార్టీ శాసనసభాపక్షనేతగా వ్యవహరించిన హెచ్‌డీ కుమారస్వామి రాజీనామా చేశారు. శనివారం విధానసౌధలో శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్‌కు రాజీనామా లేఖను అందించారు. ఇదే సందర్భంలో రాజీనామా లేఖను స్వీకరించిన తర్వాత కుమారస్వామికి స్పీకర్ శుభాకాంక్షలు తెలిపారు. విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి కూడా కుమారస్వామిని సత్కరించారు. మండ్య నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్ర కేబినెట్‌లో ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా కుమారస్వామి బాధ్యతలు చేపట్టిన మేరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతోపాటు వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు వెళ్లారు. హావేరి జిల్లా శిగ్గావి ఎమ్మెల్యేగా కొనసాగిన మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఇటీవల హావేరి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. దీంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. కాగా శుక్రవారం ఎమ్మెల్యే పదవికి తుకారాం రాజీనామా చేశారు. ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించినట్టు శాసనసభ కార్యదర్శి ఎంకే విశాలాక్షి ప్రకటించారు. సండూరు ఎమ్మెల్యే తుకారాం, శిగ్గావి ఎమ్మెల్యే బసవరాజ్ బొమ్మై, చెన్నపట్టణ ఎమ్మెల్యే కుమారస్వామి రాజీనామాలను ఆమోదించినట్టు ప్రకటనలో తెలిపారు. ఇక విధానపరిషత్ ప్రతిపక్షనేతగా వ్యవహరిస్తున్న కోట శ్రీనివాసపూజారి ఎమ్మెల్సీ పదవికి శనివారం రాజీనామా చేశారు. సభాపతి బసవరాజహొరట్టికి రాజీనామా లేఖను సమర్పించారు. ఆయన రాజీనామా లేఖను ఆమోదిస్తున్నట్టు ప్రకటించారు. కోట శ్రీనివాసపూజారి ఇటీవలి ఎన్నికల్లో ఉడుపి-చిక్కమగళూరు ఎంపీగా ఎన్నికయ్యారు.



రాజీనామా లేఖను సభాపతి బసవరాజ హొరట్టికి అందజేస్తున్న కోట శ్రీనివాసపూజారి

యోగా యూనివర్సిటీ..
కలేనా..?



యోగా విన్యాసాల్లో యువతి (ఫైల్)



- మైసూరులో ఏర్పాటు చేయాలని డిమాండ్
- ముందుకు పడని అడుగులు

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలం నుంచి ఆచరణలో ఉన్న యోగాకు ఇటీవల అంతర్జాతీయస్థాయి గుర్తింపు ఇవ్వడంతో ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమనే నమ్మకం ప్రజల్లో పెరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది యోగా శిక్షణా కేంద్రాలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం అమలులోకి వచ్చాక రాష్ట్రంలో బెంగళూరు, మైసూరు కేంద్రాలుగా భారీ కార్యక్రమాలు కొనసాగాయి. యోగా ఆసక్తి కల్గినవారి నుంచి మైసూరులో యోగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. 2022లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ యోగా దినోత్సవాన్ని మైసూరులో నిర్వహించారు. వేలాది మందితో కలసి ప్రధాని మోదీ ఆసనాలు వేశారు. ప్రధాని మోదీని ఇక్కడ యోగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. ప్రధాని మైసూరుకు వచ్చి వెళ్లి రెండేళ్లు పూర్తవుతున్నా ఆచరణకు నోచుకోలేదు. ప్రధాని మోదీ మైసూరులో యోగా దినోత్సవంలో పాల్గొనడం ద్వారా మైసూరుకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఇక్కడ యోగథాన్ ప్రారంభించడం మినహా ఇతరత్రా ఎలాంటి ప్రక్రియలు జరగలేదు. ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి ఉంటే మైసూరులో యోగాకు మరింత ప్రాధాన్యత పెరిగేదనే అభిప్రాయాలు ఉన్నాయి. మైసూరు నగర వ్యాప్తంగా వందకుపైగా యోగా శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. 20వేల మందికి పైగా ఆసక్తిపరులు నిత్యం యోగా చేస్తారు. ఇక్కడ శిక్షణ పొందినవారు దేశ విదేశాలలో యోగా శిక్షకులుగా కొనసాగుతున్నారు. మైసూరులో యోగా యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా మరింతమంది యోగా శిక్షకులు అవుతారని భావించారు.

ఓ భవనమైనా నిర్మించండి

ప్రధాని మోదీ మైసూరులో యోగా దినోత్సవంలో పాల్గొనడం ఓ చారిత్రాత్మక ఘట్టమని, ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటుకు ఎటువంటి అడుగులు ముందుకు పడడం లేదని, కనీసం యోగా భవనాన్ని అయినా ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. యోగా, ప్రాణాయామ, ధ్యానానికి ప్రత్యేక గదులు ఉండాలని, యోగాకు సంబంధించిన సదస్సులు, పలు అంశాలు చర్చ జరగాలని, ఈ భవనం యోగా పరిశోధనా కేంద్రం కావాలని, మైసూరుకే తలమానికం అనేలా ఉండాలని కోరుతున్నారు. ప్రపంచంలో ఎక్కడివారు వచ్చినా ఇక్కడ యోగా నేర్చుకునేలా ఉండాలని కోరుతున్నారు. అందుకు తగ్గట్టుగా యోగా శిక్షకులకు నియమించాలని దేశవిదేశీయులు యోగా నేర్చుకునేందుకు తగిన కేంద్రం కావాలని కోరుతున్నారు. అల్పావధి యోగా కోర్సులు ప్రారంభించాలని, ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్లు ఇవ్వాలని, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా శిక్షణలు ఇచ్చే విధానం కొనసాగాలని కోరుతున్నారు. మైసూరుకు ప్రధాని వచ్చినప్పుడు ఇక్కడ యోగా భవనం, యోగా విశ్వవిద్యాలయ స్థాపన, యోగా శిక్షకుల నియామకం, నిరంతర యోగా కార్యక్రమాలు, యోగా సదస్సులు, ఒప్పందాలు, యోగాకు సంబంధించిన ప్రాజెక్టులు అమలులోకి వస్తాయని భావించారు. కాగా మైసూరు జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ పుష్ప అభిప్రాయం ప్రకారం యోగా భవన నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి చర్చలు జరగలేదన్నారు. యోగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రెండుమూడుసార్లు చర్చలు జరిగాయని, అయితే కార్యాచరణ సాధ్యం కాలేదన్నారు.



మైసూరు ప్యాలెస్‌లో యోగా డేలో ప్రధాని మోదీ (ఫైల్)

సర్కారు బడుల్లో ఎల్‌కేజీకి
గ్రీన్ సిగ్నల్

- ఆందోళనలో అంగన్‌వాడీ కార్యకర్తలు

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతిలో చేరేందుకు ముందుగా పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లేవారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ పౌష్టికాహారం ఇవ్వడంతోపాటు వారు ఆటలాడే సౌలభ్యాలు కల్పించేవారు. ప్రతిరోజూ మూడు గంటలపాటు అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగేవి. రాష్ట్ర ప్రభుత్వం సర్కారుబడుల్లోనే ఎల్‌కేజీ, యూకేజీ ప్రారంభించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఒక్కసారిగా ఆందోళన చెందుతున్నారు. ప్రయోగాత్మకంగా కల్యాణ కర్ణాటక జిల్లాల్లో ఎల్‌కేజీ, యూకేజీలను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే అమలు చేయనున్నారు. బడులకు ముందు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లేవారు. ఒకటో తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చేరినా అంతకుముందు మాత్రం అంగన్‌వాడీ కేంద్రాలకు ఎక్కువమంది వెళ్లేవారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేవారు. ఆ తర్వాత ప్రభుత్వ లేదా ప్రాంతాలవారీగా ఉండే ప్రైవేట్ పాఠశాలలకు చేర్పించేవారు. ఓ రకంగా ప్రభుత్వ పాఠశాలకు అనుసంధానంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేసేవి. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను స్త్రీ శిశు సంక్షేమశాఖ నియమించేది. కల్యాణకర్ణాటకలోని ఏడు జిల్లాల్లో 1008 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది నుంచే ఎల్‌కేజీ, యూకేజీ ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ డైరెక్టర్, విద్యాశాఖల వినతి మేరకు పాఠశాల, సాక్షరతాశాఖల అదనపు కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. చిన్నారుల బోధనకు ఒక టీచరును, ఒక సహాయకురాలిని నియమించుకోవాలని వారికి శిక్షణ ఇవ్వాలని మార్గదర్శకాలు జారీ చేశారు.

మండిపడుతున్న అంగన్‌వాడీలు

ప్రాంతాలవారీగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీలను ప్రారంభిస్తే ఇక అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు హాజరు కారు. పైగా పాఠశాలలకే వెళ్తారు. కొన్ని రోజుల తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు లేరని వాటిని మూసివేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ప్రస్తుతం కల్యాణ కర్ణాటక జిల్లాల్లో 15వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఉన్నారు. సాధారణంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారులను చేర్పించడంతోపాటు వారికి పౌష్టికాహారం అందించే బాధ్యత కూడా ఉంది. ఇక అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం ఇతరత్రా పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలంటే చిన్నారులను చేర్పించుకోవడమే ప్రధానమైన పనిగా ఉంది. కల్యాణ కర్ణాటకలో ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతమైతే వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రమంతటా అమలు చేయాలని భావిస్తున్నారు. వేలాదిమంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ప్రత్యామ్నాయ పని కాని ఇతరత్రా విధులు అప్పగించలేదు. పాఠశాలలు ప్రారంభించే ఎల్‌కేజీ, యూకేజీ విభాగాలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను బాధ్యతలు అప్పగించాలని ఎక్కడా పొందుపరచలేదు. ఒక్కసారిగా వేలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తల భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యేలా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై అంగన్‌వాడీలు ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నారు.





శ్రీవారి ఆలయం ముందు కేంద్రమంత్రి కుమారస్వామి

శ్రీవారి సేవలో కుమార

తిరుమల, జూన్15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా కుమారస్వామి దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాత సేవలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం కుమారస్వామి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తాను శ్రీవారికి పెద్ద భక్తుడినని తెలిపారు. కేంద్రమంత్రి పదవి వరించడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. ప్రధాని మోదీ తనకు పెద్ద బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. అందులో తాను విజయవంతమయ్యేలా శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.

పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక పాలసీ

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్


బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక పాలసీని తీసుకొస్తామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌కేసీసీఐ), పర్యాటకశాఖలు సంయుక్త ఆధ్వర్యంలో దక్షిణభారత ఉత్సవ్‌ను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. పర్యాటకశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, కమిషనర్ రామ్‌ప్రసాత్ మనోహర్ ముఖ్యులుగా పాల్గొన్నారు. దక్షిణభారత్ పరిధిలోని అన్ని రాష్ట్రాల పర్యాటకశాఖ ముఖ్యులతోపాటు వివిధ పర్యాటక కేంద్రాలు, ఏజెన్సీలు భాగస్వామ్యులయ్యాయి. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఎక్కువ పెట్టుబడులు సాధించేలా పాలసీలు తీసుకొస్తామని తెలిపారు. పరిశ్రమలు పటిష్టంగా ఉంటేనే ప్రభుత్వాలు శక్తివంతం అవుతాయన్నారు. పర్యాటక కేంద్రాల ప్రగతి ద్వారా ఉద్యోగ, ఉపాధి సాధ్యమవుతుందని అన్నారు. బెంగళూరు ఐటీబీటీ, స్టార్టప్‌లతోపాటు భిన్నమైన రంగాలలో ప్రగతిపరంగా ఉందన్నారు. ఇటీవల అగ్రి టూరిజం, ఎకో టూరిజం వంటివి ప్రారంభం కావడం సంతోషకర పరిణామం అన్నారు. ఐదారు దశాబ్దాలుగా పర్యాటకం ఒకే విధంగా సాగిందని, గత రెండు దశాబ్దాలలో ప్రాధాన్యత పెరిగిందన్నారు. బెంగళూరులో కొన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 320 కిలోమీటర్లు సముద్రతీరం ఉండడం పర్యాటక ప్రగతికి అనుకూలమన్నారు. ఒకప్పుడు లాల్‌బాగ్, కబ్బన్‌పార్క్‌ను పర్యాటకులు సందర్శించేవారని, యువతరం ఆకర్షించేలా స్కైడెక్‌ల నిర్మాణం చేపడతామన్నారు. మరోవారం పదిరోజుల్లో టెండర్లు పిలుస్తామని తెలిపారు. నగరంలో అత్యంత ఎత్తైన భవనాలు రానున్నాయని వివరించారు. బృందావన్‌గార్డెన్స్‌ను డిస్నీల్యాండ్ తరహాలో తీర్చిదిద్దుతామని అన్నారు. పర్యాటక రంగాన్ని జీఎస్టీ నిర్వీర్యం చేస్తోందని విచారం వ్యక్తం చేశారు. దక్షిణ భారతీయులంతా సమష్టిగా స్పందించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఉత్సవ్‌లో రాష్ట్ర పర్యాటకశాఖకు రూ.3,750 కోట్ల పెట్టుబడులు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌కేసీసీఐ ఛైర్మన్ రమేశ్‌చంద్ర లహోటి, మాజీ ఛైర్మన్, దక్షిణభారత ఉత్సవ్ ముఖ్యులు శివషణ్ముగం, పర్యాటకశాఖ కమిషనర్ రామ్‌ప్రసాత్ మనోహర్, కార్యదర్శి సల్మా కె వహీం పర్యవేక్షణలో ఉత్సవ్ సాగగా పర్యాటకశాఖ మంత్రి హెచ్‌కె పాటిల్ కీలక సందేశం ఇచ్చారు. రెండు రోజుల ఉత్సవ్‌లో వివిధ అంశాలపై చర్చాగోష్టులు సాగుతాయి.



దక్షిణభారత ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న డీసీఎం డీకే శివకుమార్ తదితరులు




ఉత్సవ్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.69	1,581.06
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,737	106
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10	244
సామర్థ్యం (టీఎంసీలు)	5.91	5.01

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



లింగప్ప(ఫైల్)

రాయచూరు, జూన్ 15 : అప్పులు తీర్చలేన్న బెంగతో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారు. జిల్లాలోని సిందనూరు తాలూకా గోమర్సి గ్రామంలో గామానికి చెందిన లింగప్ప మడివాళ(54) శుక్రవారం సాయంత్రం పొలం దగ్గరకు వెళ్లి విషం (క్రిమిసంహారకమందు) సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని సిందనూరు తాలూకా ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. మరింత మెరుగైన చికిత్స కోసం బళ్లారిలో విమ్స్ ఆస్పత్రాకి తరలించి చికిత్సనందిస్తుండగా శనివారం ఉదయం ఆయన మృత్యువాతపడ్డాడు. లింగప్పకు మూడు ఎకరాల పొలం ఉండగా ఆయనకు కెనరా బ్యాంక్‌లో రూ.1.92 లక్షల రుణం ఉండగా ప్రైవేటు మరో రూ.4 లక్షల వరకు అప్పు ఉన్నట్లు కుటంబ సభ్యులు తెలిపారు. అప్పు తీర్చలేననే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సింధనూరు రూరల్ పోలీసులు 'కేసు నమోదు చేశారు.

ప్రేమ విఫలమై యువకుడు..



హనుమేశ్(ఫైల్)

రాయచూరు, జూన్ 15 : ప్రేమించిన యువతి తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించారని మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గదార్ గ్రామానికి చెందిన 21 ఏళ్ల హనుమేశ్ నగరంలోని నవయుగ కళాశాలకు చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థి కాగా తన స్నేహితురాలిని ప్రేమించగా ఆమెను పెళ్ళి చేసుకునేందుకు వారి కుటుంబ సభ్యులు నిరాకరించారు. యువకుడు నగర సమీపంలోని మలియాబాద్ అటవి ప్రాంతంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థళాన్ని పరిశీలించిన యరగేరా పోలీసులు యువకుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. యరగేరా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.


గోవులు, ఒంటెలను వధిస్తే చట్టపరమైన చర్యలు : ఏడీసీ

బళ్లారి సిటీ, జూన్ 15: బక్రీద్ సందర్భంగా అనధికారికంగా ఒంటెలు, ఆవులను వధించడం నేరమని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా హెచ్చరించారు. శనివారం తన కార్యాలయ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పండుగ సందర్భంగా బయటి రాష్ట్రాలు, జిల్లాల నుంచి జంతువులను అక్రమంగా రవాణా చేయరాదన్నారు. అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖలీల్ సాబ్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్ కమార్, జిల్లాపంచాయతీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రమోద్ , పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్, జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట ఇచ్చి మరిచితివా కుమారా..?

- ప్రమాదంలో చారిత్రక సండూరు ఆలయం
- దేవదరి ఐరన్ మైనింగ్‌కు అనుమతిస్తూ మంత్రి కుమారస్వామి తొలిసంతకం

బళ్లారి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చారిత్రక సండూరు గనుల ప్రాంతం..చుట్టూ దట్టమైన అడవి, కొండల మధ్యలో చాళుక్యుల కాలంలో నిర్మించిన కుమారస్వామి ఆలయం ప్రమాదంలో పడింది. దాదాపు వెయ్యేళ్ల కిందట నిర్మించిన అత్యంత పవిత్రమైన, మహిమ కలిగిన కుమార స్వామి ఆలయం మహిమాన్వితమైనది. ఇక్కడ మైనింగ్ చేపడితే ఆలయం ప్రమాదంలో పడుతుందని ఎన్నో ఏళ్ల నుంచి ప్రజాసంఘాలు వారిస్తూనే ఉన్నాయి. 2018లో కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కుమారస్వామి దర్శనానికి సండూరు వచ్చారు. ఈ సందర్భంగా కుమారస్వామి ఆలయం చుట్టూ మైనింగ్ తవ్వకాలు నిలిపేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇటీవల కేంద్ర ఉక్కుశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మైనింగ్‌కు అనుమతిలివ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది.





భక్తులతో మాట్లాడుతున్న కుమారస్వామి (ఫైల్) సండూరు కుమారస్వామి ఆలయం

- కేంద్ర ఉక్కు శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మంత్రి కుమార స్వామి జూన్ 12న సండూరు కుమార స్వామి ఆలయం చుట్టూ ఉండే ఇనుప గనుల తవ్వకాలకు కుద్రేముఖ్ ఐరన్ ఓర్(కేఐఓసీఎల్) అనే కేంద్ర సంస్థకు అనుమతినిస్తూ సంతకం చేశారు. సండూరు కుమార స్వామి ఆలయం స్వామి మలై అటవీ ప్రాంతం లో ఉంది. ఈ ప్రాంతంలో మేలు రకం(హైగ్రేడ్) ఇనుము కొండలు ఉన్నాయి.
- ఒకప్పుడు సీఎం హోదాలో భక్తులతో మాట్లాడుతూ దేవాలయం చుట్టూ సుమారు 3 నుంచి 5 కిలో మీటర్ల పరిధిలో మైనింగ్ నిషేధిస్తామని హామీ ఇచ్చారు. దేవాలయం చుట్టూ మైనింగ్ కారణంగా ఆలయం దెబ్బతింటుందని 3 నుంచి 5 కిలో మీటర్ల పరిధిలో మైనింగ్ చేయకుండా చూడాలని జనసంగ్రామ్ పరిషత్ అనే స్వచ్ఛంద సంస్థ హైకోర్టులో రిట్ పిటీషన్ కూడా వేసింది.

అయితే ఇప్పుడు కుమార స్వామి కేంద్ర ఉక్కు శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే తిరిగి ఈ ప్రాంతంలో ఇనుము తవ్వకాలకు ఉత్తర్వులు ఇస్తూ సంతకం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నాటి హామీలను కుమారుడు మరిచారా..పవిత్ర ఆలయంపైనే ఇంతటి అశ్రద్ధ ఎందుకో అని పరిసర ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. నాడు హామీ ఇచ్చిన తర్వాత కూడా మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వడంతో అప్పుడు కూడా కుమారస్వామి ప్రభుత్వం కూలిపోయిందని,

మరి ఇప్పుడైనా దేవాలయం చుట్టూ తవ్వకాలు నిషేధిస్తారా లేదా అన్నది వేచి చూడాలని చర్చించుకుంటున్నారు.

21న జిల్లా ప్రగతి సమీక్షా సమావేశం

హాజరుకానున్న సీఎం సిద్ధరామయ్య : డీసీ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ,జూన్ 15: సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జిల్లా ప్రగతి సమీక్షా సమావేశం జూన్ 21న నిర్వహించనున్నారని జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పంచాయతీ హాల్లో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య జూన్ 21న జిల్లాలో పర్యటిస్తారని, అధికారులు తమ శాఖల ప్రాజెక్టుల పురోగతి సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో కరువు నివారణ చర్యలు, పంటల బీమా కురువు నివారణ, ప్రస్తుత సంవత్సరం వర్షపాతం వివరాలు తదితర సమాచారం పక్కాగా సేకరించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పశుగ్రాసం లభ్యత, కోడెదూడల ఆరోగ్య పరిస్థితి, వృద్ధిరేటు, పాల ఉత్పత్తి తదితర సమాచారం సేకరించాలన్నారు. దీనిపై పక్క సమాచారం ఇవ్వాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికి సంబందించిన కార్యక్రమాలు, పాఠశాలల స్థితిగతులు, నాణ్యమైన విద్య కోసం అమలు చేస్తున్న మార్గదర్శకాల గురించి తమకు సమాచారం ఇవ్వాలని డీడీపీఐ ఆదేశించారు. బళ్లారి నగరంలో తాగునీటి సరఫరా రాజకెనాల్ పరిశుభ్రత చెత్త తొలగింపు , రోడ్ల పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. సమావేశానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాదికారి రాహుల్ శరణప్పమాట్లాడుతూ అధికారులు తమ కింది స్థాయి అధికారులతో పూర్తి సమాచారం తెప్పించుకోవాలన్నారు. ఈసందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరాతో పాటు జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణం..బహు భారం..!



ఆగిపోయిన ఆంధ్రాళ్ వంతెన నిర్మాణ పనులు

- రెండేళ్లుగా ఆగిన వంతెన నిర్మాణ పనులు...
- వరదనీటిలో కొట్టుకు పోయిన తాత్కాలిక రోడ్డు...
- ఆంధ్రాతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల రాకపోకలు బంద్
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు...

బళ్ళారి గాంధీనగర్, జూలై 15: ఆంధ్రాల్ సమీపంలో వాగుపై ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు ఆగి పోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాకపోకల కోసం ఏర్పాటు చేసి రోడ్డు కాస్త భారీ వర్షాలకు కొట్టుకుని పోయింది. దీంతో బళ్లారి నగరం నుండి ఆంధ్రాల్, బొబ్బకుంట తదితర గ్రామలకు ఐదారు రోజులుగా రాకపోకలు ఆగిపోయాయి. ఇదే వంతెన గుండానే ఆంధ్రాళ్ ప్రాంతానికి తాగునీటి సరఫరా చేసే పైపులైన్ కూలి పోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అయితే 8వ వార్డుకు చెందిన కార్పొరేటర్ గాని, ప్రజా పనుల శాఖ అధికారులు ఇంతవరకు ఆ ప్రాంతానికి తొంగి చూడలేదు. సిటీ నియోజకవర్గం పరిధిలో 8వ డివిజన్ పరిధిలోకి ఆంధ్రాళ్ ప్రాంతం చేరినా... స్థానిక ఎమ్మెల్యే ఇప్పటి వరకు అటువైపు వెళ్ళి సమస్యను పరిశీలించన దాఖలాలు లేవు. ప్రజా ప్రతినిధులు కూడా సమస్యను స్థానిక ప్రజా పతినిదుల దృష్టికి తీసుకెళ్ళదు. కారణం గత బీజేపీ ప్రభుత్వం హాయంలో నగరంలో చేపట్టిన పనులకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే ఏమి పట్టించుకోవడం లేదని ఆంధ్రాళ్ నగర వాసులు అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత బిజేపీ ప్రభుత్వం హయాంలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఉన్న నియోజక వర్గాలకు 2022 సంవత్సరంలో అపెండిక్స్-ఈ 5054 నిధుల క్రింద బళ్ళారి నగరాభివృకి సుమారు 50కోట్ల వరకు నిధులు మంజూరు అయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే జి.సోమశేఖర్ రెడ్డి వచ్చేది తమ ప్రభుత్వం అనుకున్నారు కాబోలు.. అదనంగా విడుదలైన రూ 50కోట్లు ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే, అధికారుల నమ్మకంతో కాంట్రాక్టర్లు చకాచకా పనులు చేసి బిల్లులకు ఎదురు చూస్తున్న సమయంలో రాష్ట్రంలో అధికారం మారింది. దీంతో అప్పటి ఎమ్మెల్యేపై ఉన్న నమ్మకంతో కోట్లు ఖర్చు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇంతవరకు చిల్లిగవ్వ కూడా రాకపోవడంతో అపెండిక్స్-ఈ క్రింద పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిషమంగా ఉన్నట్లు, అప్పుచేసి తెచ్చిన పెట్టిన పెట్టుబడికి వడ్డీలు కట్టలేక ఊర్లు వదాల్సిన పరిస్థితి నెలకొందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. వంతెన సమయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో నగరంలో అటువైపు గ్రామాలకు సంబంధం తెగిపోయాయి. నగరానికి చేరుకోవాలంటే 10కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆయా గ్రామ ప్రజలు పోతున్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి చొరవ తీసుకుని వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





కుంగిపోయిన తాగునీటి పైప్‌లైన్, ఆంధ్రాళ్ వద్ద ప్రవహించే వాగు...

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



కేపీసీఎల్ ముందు నిరసనలో రక్షణ వేదిక పదాధికారులు

కంప్లి, జూన్ 15 : కేపీసీఎల్ వద్ద ధ్వంసమైన కుడితిని, తిమ్మలాపురం రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపట్టాలని కర్ణాటక రక్షణ వేదిక సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం తిమ్మలాపురం కేపీసీఎల్ నార్త్ గేట్ వద్ద నిరసనలకు దిగారు. ఈ సందర్భంగా భావి శివకుమార్, తిమ్మప్ప, నరసింహరాజులు మాట్లాడుతూ కేపీసీఎల్ నుండి గ్యాస్ తరలించే వాహనాల వల్ల పూర్తిగా రోడ్డులో మోకాలిలోతు గుంతలు ఏర్పడ్డాయన్నారు. బళ్లారి నుంచి కంప్లి, గంగావతికు వైపు వెళ్ల వాహనాలకు పూర్తిగా బస్సు రవాణాకు ఇబ్బందికరంగా ఉందన్నారు. రోడ్డు మరమ్మత్తులు చేపట్టక పోతే జిల్లా స్థాయిలో రాస్తారోకో చేపడతామని హెచ్చరించారు. నిరసనలో జంగ్లి సాబ్, ఆనంద్, దేవేంద్ర, మాలింగ, నాగలింగాచారి, నళిని, రమేష్, నాగరాజు, రుద్రప్ప, బసప్ప, శ్రీనివాస్, దొడ్డ బసప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోండి..

కంప్లి, జూన్ 15 : దివ్యాంగులు, వృద్ధులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కంప్లి తాలుకా ఆరోగ్య అధికారి అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం కంప్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అలిమ్‌కో సంస్థ వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ దివ్యాంగ శాఖ, అలిమ్‌కో సంస్థ వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలిమ్‌కో ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంగవికలాంగ అధికారి గోవిందప్ప, శశికళ, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోండి : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేష్

సిరుగుప్ప, జూన్ 15 : బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ వెంకటేష్ పేర్కొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సోమవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ ప్రజలు ముస్లింలకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సీఐ హనుమంతప్ప, ఎస్ఐ తిమ్మన్న నాయక, ముస్లిం ప్రముఖులు అబ్దుల్ నబీ, డాక్టర్ మహమ్మద్ అలీ, ఖాసీమ్, అండి హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నారు పద్ధతితో అధిక దిగుబడి

కంప్లి, జూన్ 15 : రైతులు నారు పద్దతిలో నాట్లు వేసుకోవడం వల్ల రైతులకు అధిక దిగుబడి లభిస్తుందని సండూరు వ్యవసాయ శాఖ సహాయ అధికారి మంజునాథ తెలిపారు. కంప్లి పట్టణంలో శనివారం ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ హోస్పేట, హగరి బొమ్మనహళ్లి ప్రాంతాల్లో నారు పద్దతిలో నాటడం వల్ల అధిక దిగుబడి వచ్చిందన్నారు. రైతులు ఇదే విధానాన్ని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంప్లి వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, హాలప్ప, తంజుకుమార్, రైతన్నలు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే వ్యాధులకు చెక్ : సీఈఓ

బళ్లారి సిటీ, జూన్ 15: దోమల నివారణపై ప్రజలకు అవగాహక కల్పించాలని జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప వైద్యాధికారులను ఆదేశించారు. మలేరియా నిరోధక మాసంలో బాగంగా జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారుల హాల్లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వర్షాకాలంలో దోమల బెడద అధికంగా ఉంటుందని, రహదారులపై మురికినీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. దోమల ద్వారా మలేరియా డెంగీ, చికెన్‌గున్యా ప్రబలే అవకాశం ఉందన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు మాట్లాడుతూ మలేరియా నిరోధక మాసంలో బాగంగా ప్రజలకు విరివిగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా కమ్యూనికేబుల్ డీసీజ్ కంట్రోల్ అధికారి డాక్టర్ అబ్దుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2025నాటికి జిల్లాలో మలేరియా నివారణ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళి వచ్చిన వారికి మలేరియా స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. మలేరియా నిర్ధారణ అయిన వారిని ఇంటెన్సీవ్ ట్రీట్‌మెంట్ అందించాలన్నారు. ఈసందర్భంగా జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మరియంబి, డాక్టర్ పూర్ణిమ కట్టిమణి, డాక్టర్ వీరేంద్ర, డా.హనుమంతప్ప, తాలూకా ఆరోగ్య అధికారులు , వైద్యాధికారులు, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్‌దాసప్పనవర్, ఇతర జాతీయ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప

ఖర్గేను కలిసిన బళ్లారి ఎంపీ

కంప్లి, జూన్ 15 : ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతో బళ్లారి నూతన ఎంపీ తుకారామ్ భేటీ అయ్యారు. శనివారం బెంగళూరులో కలిసిన ఆయన ఖర్గేకు పుష్పగుచ్ఛం అందించి ఆయనకు అభినందనలు తెలిపారు. బళ్లారి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.



ఖర్గేతో ఎంపీ తుకారామ్

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించండి: కరవే

బళ్లారిరూరల్, జూన్ 15 : తాలుకాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలని కర్ణాటక రక్షణ వేదిక గ్రామీణ అధ్యక్షులు పంపనగౌడ్ పలువురు మనవిపత్రం అందించారు. గ్రామీణ ప్రదేశాల్లో పాఠశాలలు, కళాశాలల్లో ఆవరణలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు వసతులు కల్పించాలని అధికారులకు మనవిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రక్షణ వేదిక గ్రామీణ అధ్యక్షులు పంపనగౌడ్ , మంచేరి గోవర్దన్, అంజనీ, గంగాధర్, రామయ్య, జలహాళ్ స్వామి గౌడ, రంగయ్య, జయరామ్ సంఘ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున్

వైభవంగా ఆండాళ్ రంగమన్నార్ తిరుకల్యాణం

హోసూరు, జూన్ 15: హోసూరులోని ముక్తాభాయ్ మహిళా భజన మండలి ట్రస్ట్ తరపున ఆండాళ్ రంగమన్నార్ తిరుకల్యాణ వైభవం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మునీశ్వర్ నగర్‌లోని విజయ వినాయక ఆలయంలో ఉదయం మహాగణపతి హోమంతో ప్రారంభమైన ఈ ఉత్సవంలో అష్టపతి, నవపతి, అభంగం, డోలోత్సవం కోలాటం, భజనలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళలు ఆండాళ్ నాచియార్ ఆశీర్వదించిన తిరుపావై పారాయణం చేశారు. అనంతరం ఉత్సవనామ సంకీర్తనలు, దర్శనీయ శ్రేణులను తీసుకొచ్చి ఆండాళ్ రంగమన్నార్‌కు సమర్పించారు. అలాగే వైష్ణవ ఆచారాల ప్రకారం ముత్యాల తలంబ్రాలు, మాల మార్పిడి, పసుపు స్నానం నిర్వహించారు. అనంతరం తిరుమాగల్యం ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణం వైభవంలో ప్రత్యేకంగా మహిళలు పాల్గొని నామ సంకీర్తనలు భజనలు చేసి వేద మంత్రోచ్చారణలు చేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

పచ్చదనంపై అవగాహన ర్యాలీ



ఊరేగింపుగా వెళ్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హోసూరు, జూన్ 15: హోసూరు జూజూవాడి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో జాతీయ హరితదళం ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నర్మదాదేవి, నేషనల్ గ్రీన్ ఫోర్స్ కో ఆర్డినేటర్ స్వర్ణ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అవగాహన ర్యాలీకి మున్సిపల్ ప్లానింగ్ కమిటీ చైర్మెన్ అశోక్‌రెడ్డి, మున్సిపల్ విద్యా కమిటీ చైర్మెన్ శ్రీధర్ పచ్చజెండా చూపారు. జూజూవాడి, సిప్‌కాట్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలకు చెందిన 1800 మంది విద్యార్థులు మొక్కలు, పసుపు సంచులు, అవగాహన బ్యానర్లు చేతపట్టుకుని ప్రధానవీధుల గుండా సాగారు. ఇదే సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని, పసుపు సంచులను వినియోగించాలని నినాదాలు చేస్తూ ప్రజలకు బట్టతో రూపొందించిన పసుపు సంచులను అందజేశారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ మొక్కలు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. అవగాహన ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కలుషిత నీటి బాధితులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

హోసూరు, జూన్ 15: హోసూరుప్రాంతంలో కలుషిత నీరు తాగిన అస్వస్థతకు గురైనవారి సంఖ్య 80కు చేరింది. దీంతో ఆ ప్రాంతవాసులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నయళసగిరి, అంబేడ్కర్‌నగర్ వాసులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై ఆసుపత్రులలో చేరారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చేరిన శనివారంనాటికి బాధితుల సంఖ్య 80కు చేరింది. ప్రస్తుతం అందరూ కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నిరంతరంగా ఏడు వైద్యబృందాలు పరీక్షలు చేస్తూ పర్యవేక్షిస్తున్నాయి.

18న విద్యుత్ కోత

హోసూరు, జూన్ 15: కృష్ణగిరి పవర్ డిస్ట్రిబ్యూషన్ సర్కిల్‌లోని హోసూరు డివిజన్‌లో అత్యవసర మరమ్మత్తుల నిర్వహణ కారణంగా ఈనెల 18న విద్యుత్‌కోత విధించనున్నారు. 110-11కేవీ బాగలూరు సబ్ స్టేషన్, 110 కేవీ కెంబట్టి సబ్ స్టేషన్‌లకు ఈనెల 18న మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవసరమైన విద్యుత్ పరికరాల నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. సబ్‌స్టేషన్ పరిధిలోని కెంబట్టి, బెలగొండపల్లి, మదగొండపల్లి, షూనపల్లి, ముత్తూరు, కప్పకల్, ఉలి వీరనపల్లి, ఉన్నట్టి, ఉప్పారపల్లి, జాగీర్కోడిపల్లి, తళిఉబ్బనూరు, కురుబరపల్లి, కె.అగ్రహారం, కుప్పట్టి, టి.కొత్తూరు, నల్లసంద్రం, తరవేంద్రం, పి.పి.మానుపల్లి, కెంబతపల్లి, ఉణిసేనత్తం, బిన్నమంగళం, కక్కదాసం గ్రామాలలో అంతరాయం ఉంటుందని అధికారులు ప్రకటనలో తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

- దుష్పరిణామాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలి : న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, జూన్ 15: బాల్య వివాహాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి రాజేశ్ హొసమనె సూచించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా పరిపాలన , జిల్లాపంచాయతీ, మహిళా శిశు అభివృద్ధిశాఖ, రాష్ట్ర రెసిడెన్షియల్ విద్యాసంస్థల సంఘం, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సంఘంలో బాల్య వివాహాలు, బాలల రక్షణ విధానంపై శనివారం జిల్లా పంచాయతీ హాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాద్యాయుల కోసం ఏర్పాటు చేసిన ఒక రోజు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. లైంగిక వేధింపుల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలన్నారు. బాలికలకు విద్యను అందించి సమాజంలో సమానత్వం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి ఆర్థిక సాంకేతిక విద్యతోపాటు న్యాయపరమైన అంశాల్లో బాలికల అభివృద్ధి ముఖ్యమన్నారు. 13నుంచి 18ఏళ్ల లోపు పిల్లలు తప్పుదారి పట్టకుండా చేయడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కర్తవ్యమన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు పిల్లలపై లైంగిక వేధింపుల నివారణకు పోక్సో చట్టం కింద కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభించామని, బాలల హెల్ప్‌లైన్ నంబర్ 1098 లో సంప్రదించి అవగాహన కల్పించాలన్నారు. చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు వేధింపులు గురైతే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. మహిళా శిశుసంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లల సమస్యలను అర్థం చేసుకుని సంబందిత శాఖకు సమాచారం అందించాలన్నారు. డాక్టర్ రాఘవేంద్ర భట్ బాల్యవివాహాలు, పోక్సో చట్టం, బాలల రక్షణ విదానం 1016గురించి సమాచారం అందించారు. ఉప సంచాలకులు ఉమాదేవి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఇన్‌చార్జి జిల్లా బాలల పరిరక్షణ అధికారి జాలప్ప, సిబ్బందితో పాటు కళాశాల ప్రదానోపాద్యాయులు, పాఠశాల ప్రధానోపాద్యాయులు పాల్గొన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

అంజనాద్రికి పోటెత్తిన భక్తులు

బళ్లారిరూరల్, జూన్ 15 : హనుమంతుడి జన్మస్థలం అంజనాద్రిలో శనివారం భక్తులు పోటెత్తారు. పూజల కోసం బళ్లారి, విజయనగరం, కొప్పాళ్, అనంతపురం, కర్నూలు జిల్లా నుండి పెద్దఎత్తున భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం చుట్టుపక్కల ప్రాంతాలు, సమీపంలో సమీపంలో విజయ నగర సామ్రాజ్యం నాటి హంపి గురించి పలు విశేషాలు తెలుసుకుని పూజలు నిర్వహించారు.

రైతు నాయకుడు సిద్దప్ప మృతి

కంప్లి, జూన్ 15 : కుడితిని పట్టణానికి చెందిన రైతు సంఘం నాయకులు మెట్రి సిద్దప్ప (75) మృతి చెందారు. శనివారం అనారోగ్యంతో సొంత ఇంట్లోనే కన్నుమూశారు. అతని అంత్యక్రియలు ఆదివారం చేపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మెట్రిసిద్దప్ప మృతితో రైతులు, నాయకులు, కుడితిని వాసులు విచారం వ్యక్తం చేశారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

స్టాన్ లారెల్ (జయంతి)




క్లాజికల్ హాలివుడ్‌లో తమదైన గుర్తింపుతో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన లారెల్ అండ్ హార్డి ద్వయంలో ఒకరైన స్టాన్ లారెల్ 1890 జూన్ 16న ఇంగ్లండ్‌లోని ల్యాంకషైర్‌లో జన్మించారు. నటుడిగా 50 సినిమాలకుపైగా నటించారు. అమెరికన్ ఒలివర్ హార్డితో కలసి ఒక జట్టుగా ఏర్పడి 1927 నుంచి 107 సినిమాలు, 32 షార్ట్ మూకీలు, 40 షార్ట్ టాకీలు, 23 పూర్తి నిడివి కలిగిన ఫీచర్ సినిమాలలో నటించారు. బుల్లితెరపైనా తమ సత్తా చాటుకున్నారు. 8ఎంఎం, 16 ఎంఎం హోం మూవీస్, తదితరాలలో రాణించారు. 1965 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

ఆచంట జానకిరాం (జయంతి)



రేడియో ప్రయోక్తగా, రచయితగా, చిత్రకారులుగా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆచంట జానకిరాం 1903 జూన్ 16న జన్మించారు. విశ్వగురు రవీంద్రనాథ్‌ఠాగూర్, అని బిసెంట్‌లను స్ఫూర్తిగా తీసు కుని ముందుకు సాగారు. ఆలిండియా రేడియోలో ప్రసార ప్రముఖులుగా పనిచేశారు. మదరాసు నుంచి తొలి తెలుగు నాటకం 'అనార్కలి' జానకిరాం ప్రయో క్తగా వెలువడింది. అంతేకాక రచయిత, చిత్రకారులుగా కూడా రాణించారు. వాణి పత్రిక సహాయ సంపా దకులుగా పనిచేశారు. 1994లో కన్నుమూశారు.

మల్లాది రామకృష్ణశాస్త్రి (జయంతి)



ప్రముఖ తెలుగు రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి 1905 జూన్ 16న కృష్ణాజిల్లా చిట్టిగూడూరు గ్రామంలో జన్మించారు. కృష్ణా పత్రికలో ఛందోబద్ధమైన కవిత్వం రాశారు. 'చలువ మిరియాలు' పేరిట ఆయన రాసిన వ్యంగ్య వ్యాసాలకు పాఠకాదరణ లభించింది. 19వ యేటనే కథారచన ప్రారంభించి సుమారు 125 కథలు రాశారు. డుమువులు కథ 14 భారతీయ భాషలలోకి అనువదించబడింది. 'కృష్ణాతరం' నవల తెలుగుసాహిత్య చరిత్రలో తనదైన గుర్తింపు పొందింది. కాగా తెలుగు సినీరంగంలో 'ఘోస్ట్ రైటర్'గా నిలిచారు. 1965 సెప్టెంబరు 2న కన్నుమూశారు.

హేమంత్‌కుమార్ (జయంతి)



ప్రముఖ బెంగాలీ గాయకుడు, సంగీత దర్శకుడు హేమంత ముఖోపాధ్యాయ 1920 జూన్ 16న వారణాసిలో జన్మించారు. హేమంత్ కుమార్‌గా పేరొందారు. మరాఠీ, గుజరాతీ, ఒడియా, అస్సామీస్, తమిళ్, పంజాబీ, భోజ్‌పురి, కొంకణి, సంస్కృతం, ఉర్దూ తదితర భాషలలో పాటలు పాడారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత. 'పద్మభూషణ్'కు నామినేట్ చేయగా సున్నితంగా తిరస్కరించారు. ఉత్తమ నేపథ్య గాయకుడిగా రెండు జాతీయ అవార్డులు, ఉత్తమ సంగీత దర్శకుడిగా పలు అవార్డులు పొందారు. 1989 సెప్టెంబరు 26న కన్నుమూశారు.

ఆచార్య ప్రఫుల్ల చంద్రరాయ్ (వర్ధంతి)



రసాయనశాస్త్ర పితామహగా పరిగణించబడిన ఆచార్య, 'సర్' ప్రఫుల్ల చంద్రరాయ్ 1861 ఆగస్టు 2న జన్మించారు. బెంగాలీకి చెందిన రసాయనవేత్త, విద్యావేత్త, చరిత్రకారుడు, పారిశ్రామికవేత్త, మానవతావాది. దేశపు తొలి ఔషధ సంస్థ బెంగాల్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ స్థాపించారు. సైన్సుపై పలు రచనలు, పుస్తకాలు రాశారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీచే గుర్తింపు పొందారు. 1944 జూన్ 16న కన్నుమూశారు.

కమలా నారాయణ్ (పుట్టినరోజు)




'పద్మభూషణ్' గ్రహీత కమలా లక్ష్మీ నారాయణ్ 1934 జూన్ 16న జన్మించారు. భరతనాట్య కళాకారిణిగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో పిన్న వయస్కురాలిగా సత్తా చాటుకున్నారు. 1940-70 మధ్య దేశవ్యాప్తంగా పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. నాట్య పద్మాన్, కర్ణాటిక్ మ్యూజిక్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికాచే జీవితసాఫల్య పురస్కారం, ఇతర అవార్డులు పొందారు.

సంతోష్‌హెగ్డే (పుట్టినరోజు)



జస్టిస్ నిట్టె సంతోష్‌హెగ్డే 1940 జూన్ 16న ఉడుపి జిల్లా గ్రామంలో జన్మించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా వంటి కీలక హోదాలలో కొనసాగారు. 2005లో సుప్రీంకోర్టు జస్టిస్‌గా రిటైరయ్యాక కర్ణాటక లోకాయుక్తగా 2006 నుంచి 2011 వరకు కొనసాగారు. అవినీతిపరుల గుండెల్లో సింహస్వప్నంగా నిలిచారు. మంగళూరు యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

రాబిన్ శర్మ (పుట్టినరోజు)



రాబిన్ శర్మ 1964 జూన్ 16న జన్మించారు. కెనడియన్ రచయిత, ప్రసంగీకుడు. ప్రపంచంలోని టాప్ 5 లీడర్‌షిప్ ఎక్స్‌పర్ట్‌లలో ఒకరిగా నిలిచారు. ప్రపంచంలో పేరొందిన మైక్రోసాఫ్ట్, ఫెడెక్స్, నైక్, జీఈ, హెచ్‌పీ, ఒరాకిల్ నుంచి నాసా, యేల్ యూనివర్సిటీ తదితర సంస్థలు ముఖ్య కార్యక్రమాలకు ఆయననే ఎంచుకుంటాయి. 'ది లీడర్ హూ హ్యాడ్ నో టైటిల్' అనే పుస్తకం ఎంతో పేరొందింది. 75దేశాలకుపైగా 1.5కోట్లకుపైగా పుస్తకాలు అమ్ముడయ్యాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బంగారపేట, జూన్ 15: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని భావితరాల ఉజ్వల భవిష్యత్తుకోసం పచ్చదనాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని పోలీసు అధి కారి నంజప్ప అభిప్రాయపడ్డారు. పట్టణంలోని దివ్య విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో ఫోక స్ స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజర్ హరీశ్ నేతృత్వంలో శనివారం ఏర్పాటైన పర్యావరణ దినో త్సవంలో పాల్గొని మాట్లాడారు. మానవుడి స్వార్థం, అభివృద్ధి పేరిట ప్రకృతి నాశనం అవుతోం దని విచారం వ్యక్తం చేశారు. ప్రకృలోని జీవ వైవిధ్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఎం తైనా ఉందన్నారు. ఫోకస్ సంస్థ హరీశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. సంస్థ ద్వారా ఇప్పటికే 13వేలకుపైగా మొక్కలు నాటామన్నారు. కార్య క్రమంలో సంస్థ కార్యదర్శి లలితమ్మ, పాఠశాల ముఖ్యులు సరస్వతమ్మ, అక్షరదాసోహ అధ్యక్షుడు ఎంఎన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు

దేశవాళీ పశుసంపదను పెంచాలి

మహదేవపుర, జూన్ 15: దేశవాళీ రకం హళ్ళికార్ పశువులను పెంచుతున్న వర్తూరు సంతోష్‌పాత్ర అభినందనీయమని నటుడు ధ్రువసర్జా అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని రామగొండనహళ్ళిలో హళ్ళికార్ ఎద్దులను శనివారం ప్రత్యేకంగా ఊరేగించారు. బసప్ప, దుగ్గమ్మదేవి దీపోత్సవంలో హళ్ళికార్ ఎద్దులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మాజీ మంత్రి అరవింద లింబావళి మాట్లాడుతూ భారత పరంపరలో అవసానదశలో ఉన్న హళ్ళికార్ గోసంతతిని నేటి యువత ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా సంతోష్ నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి హళ్ళికార్ గోవుల ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మహదేవపుర నియోజకవర్గంలో సంతోష్ నేతృత్వంలో హళ్ళికార్ ఉత్సవానికి తమ సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నటుడు ధ్రువసర్జాకు హళ్ళికార్ పశువులను వర్తూరు సంతోష్ బహుమతిగా అందచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి, హళ్ళికార్ సంతోష్, ఎల్ రాజేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



హళ్ళికార్ పశువులతో ఎమ్మెల్యే దంపతులు

రక్తదానం ప్రాణదానం



రక్తదాన శిబిరంలో నిర్వాహకులు

▸▸ రక్తదాతలకు ఆత్మీయ సత్కారం

విజయపుర, జూన్ 15: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారిని కాపాడడం ద్వారా సమాజరుణం తీర్చుకోవాలని జిల్లా ఆరోగ్య కేంద్రం ఆర్‌సీహెచ్ డాక్టర్ సీమా రుద్రప్ప మాబళె అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ప్రగతి ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం, ప్రగతి పరిశ్రమల తర్ఫీదు కేంద్రం, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, కర్ణాటక రాష్ట్ర రక్త చలనా పరిషత్, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, బెంగళూరు రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. 186మార్లు రక్తదానం చేసి బ్లడ్ కుమార్‌గా పేరొందిన కుమార్ మాట్లాడుతూ నిరంతరంగా గడువు ప్రకారం రక్తదానం చేయడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా ఉంటారన్నారు. పలు సందర్భాలలో గొడవలు, ప్రమాదాలు, సర్జరీలు, ప్రసవం, కేన్సర్ తదితర బాధితులకు రక్తం ఆవశ్యకత ఉంటుందన్నారు. రక్తాన్ని ప్రత్యేకంగా ఉత్పత్తి చేయడం సాధ్యం కానందున యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు కాపాడాల న్నారు. రక్తదాతలను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రగతి విద్యా సంస్థల ఎండీ కృపాశంకర్, ప్రిన్సిపాల్ నాగరాజ్, రెడ్‌క్రాస్ కేంద్రం వైద్యాధికారులు నరేశ్‌బాబు ప్రగతి ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ హరీశ్‌కుమార్, రెడ్‌క్రాస్ సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెళ్లూటిలో వనమహోత్సవం

శిడ్లఘట్ట, జూన్ 15: తాలూకాలోని బెళ్ళూటి గ్రామంలో పర్యావరణ ప్రేమి సంతోష్ జయంతిని పురస్కరించుకుని మొక్కలు నాటడం ద్వారా వనమహోత్సవాన్ని ఆచరించారు. తొలుత సంతోష్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బెళ్ళూటి గ్రామంలోని కుంట వద్ద, హిత్తలహళ్ళి ప్రభుత్వ స్థలంలోనూ, కేఎస్ఆర్టీసీ డిపో, రిచ్‌మండ్ ఫెలోషిప్ సొసైటీ స్థలంలోనూ సంతోష్ జయంతి నేపథ్యంలో మొక్కలు నాటారు. మోటివేషన్ ఇండియా సంస్థ ముఖ్యులు టి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ దివ్యాంగుల అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. ఈ సంవత్సరం కూడా పర్యావరణంకోసం బెళ్ళూటి గ్రామంలో 200కు పైగా మొక్కలను నాటామని 70కుపైగా స్వయంసేవకుల పాల్గొన్నారన్నారు. ఆనూరు గ్రామపంచాయతీ పీడీఓ కాత్యాయని మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో కూడా పర్యావరణ కార్యక్రమాలు మీ సహకారంతో ముందుకు సాగాలన్నారు. నవజీవన సేవా సంస్థ అధ్యక్షుడు మునిరాజు మాట్లాడుతూ బెళ్ళూటి సంతోష్ సుమారు 11వేలకుపైగా మొక్కలు నాటి తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారన్నారు. అతను చూపిన మార్గంలో తమవంతుగా పర్యావరణానికి చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. మోటివేషన్ ఇండియా బెంగళూరు, స్టేట్‌స్ట్రీట్ బెంగళూరు, సిఎస్ఐ జీవన సేవాసంఘం చిక్కబళ్ళాపుర, అటవీ శాఖ శిడ్లఘట్ట, ఆనూరు గ్రామపంచాయతీల సహకారంతో కార్యక్రమాలు కొనసాగాయి. అటవీశాఖ అధికారులు సుధాకర్, నాగార్జున, గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలు నేత్రావతి, గ్రామపంచాయతీ సభ్యురాలు ప్రేమ ఆనంద్, నవ జీవన సేవా సంస్థ కార్యదర్శి రవి, సభ్యులు, రిచ్‌మండ్ ఫెలోషిప్ సొసైటీ కార్యదర్శి గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.



వనమహోత్సవంలో వివిధ సంఘాల సభ్యులు

అపోలో హెల్త్ చెక్‌కు మంత్రి శ్రీకారం

బెంగళూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ ఆసుపత్రులు కల్గిన అపోలో ఆధ్వర్యంలో హెల్త్‌చెక్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించింది. బెంగళూరులో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు లాంఛనంగా ప్రారంభించారు. వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ రణదీప్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రజని, అపోలో కర్ణాటక సీఈఓ డాక్టర్ మనీష్‌మట్టు, జాయింట్ డైరెక్టర్ ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంటి చెంతకే వైద్య పరీక్షలు, సేవలు అందించే విధానం తీసుకురావడం సంతోష కరమన్నారు. ప్రజలకు ఎంతో ప్రయోజనకరమన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య రక్షణకోసం ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందన్నారు. హృద్రోగ, మధుమేహం, బీపీతోపాటు సీజనల్ వ్యాధులపట్ల అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. అపోలో ఆసుపత్రులు హెల్త్‌చెక్ ఆన్ వీల్స్ ప్రారంభించడం అభినందనీయమన్నారు.



సేవలను ప్రారంభిస్తున్న మంత్రి దినేశ్‌గుండూరావు



సంచారానికి సిద్ధంగా ఉన్న కామరాజ్ రోడ్డు

ఐదేళ్ల తర్వాత కామరాజ్ రోడ్డుకు విముక్తి

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తర్వాత కామరాజ్ రోడ్డుపై సంచారానికి అవకాశం లభించింది. ఎంజీ రోడ్డు నుంచి కబ్బన్‌రోడ్డుకు వచ్చే 220 మీటర్ల మేర ఒకవైపు సంచారానికి ముక్తి కల్పించారు. 2019 జూన్‌లో నమ్మ మెట్రో పనుల కారణంగా రోడ్డును మూసివేశారు. పింక్‌లైన్‌లో భాగంగా నాగవార నుంచి కాలేన అగ్రహార దాకా నిర్మించే మెట్రోపనులు అండర్‌గ్రౌండ్‌లో నిర్మిస్తున్నందున రోడ్డు మూసివేశారు. ప్రస్తుతానికి వన్‌వేగా రోడ్డుపై సంచరించేందుకు వీలు కల్పించారు. ఎంజీ రోడ్డునుంచి కబ్బన్‌రోడ్డువైపు మాత్రమే వచ్చేందుకు వీలుంది. రోడ్డు మూతపడినందున శివాజినగర్, కమర్షియల్ స్ట్రీట్‌కు వెళ్లదలిచేవారు అనిల్‌కుంబ్లె లేదా ట్రినిటీ సర్కిల్‌దాకా వెళ్లాల్సి ఉండేది. ఐదేళ్ల తర్వాత సంచారానికి అనుకూలం కావడంపై వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోయాలుక్కాస్ రెండోశాఖ ప్రారంభం

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ తన రెండోశాఖను నగరంలోని కమ్మనహళ్ళిలో ఏర్పాటు చేసింది. శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా బంగారు, వజ్రాభరణాలు, వెండి ఆభరణాలపై మేకింగ్‌చార్జీలలో 50శాతం రాయితీ ఇస్తున్నట్టు ప్రకటించారు. జులై 14వరకు ఆఫర్ ఉంటుందని సంస్థ గ్రూప్ చైర్మన్, ఎండీ జాయ్ అలుక్కాస్ ప్రకటించారు. రెండోశాఖ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఖాతాదారుల ఆదరణతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కేసీ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శాఖ ప్రారంభంలో ప్రముఖులు


వైభవంగా శ్రీరాముడి రథోత్సవం

చింతామణి, జూన్ 15: పట్టణంలోని ఎన్ఆర్ లే అవుట్‌లోని బ్రహ్మచైతన్య శ్రీరామమందిరం 75వ వార్షిక మహోత్సవంలో చివరి రోజు శనివారం రథోత్సవం వైభవంగా జరిగింది. సీతారామలక్ష్మణ ఆంజనేయసమేత బ్రహ్మచైతన్య స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, అష్టావధాన సేవ, సామూహిక భజన, మహామంగళారతి అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు. నాదస్వరం, కోలాటం, వేదఘోష, భజనలు, సంకీర్తనల నడుమ రథోత్సవం సాగింది. మహారాష్ట్ర ప్రాంత భక్తులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీరామమందిర అధ్యక్షుడు వెంకటేశ్‌మూర్తి ఉపాధ్యక్షుడు రఘునాథ్, ప్రముఖులు బీసీ ప్రసాద్, జయరాం, నారాయణ్, రాజారాం, శేషాద్రి, అనంతశాస్త్రి, అశ్వథనారాయణ, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



పురవీధులలో సీతారాముల ఊరేగింపు

సీనియర్ విద్వాంసుడు రాఘవేంద్ర ఉపాధ్యాయ కన్నుమూత



రాఘవేంద్ర (ఫైల్)

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉడుపికి చెందిన సీనియర్ విద్వాంసుడు సగ్రి రాఘవేంద్ర ఉపాధ్యాయ (71) బెంగళూరులో శనివారం కన్నుమూశారు. ప్రవచనకారుడిగా, గ్రంథకర్తగా, పబ్లిషర్‌గా రాణించారు. వేదాంత శాస్త్రంలో, సంస్కృతంలో ఎంఏ చేసిన ఆయన ఉడుపిలోని ఎస్ఎంఎస్‌పి సంస్కృత కళాశాలలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఉడుపిలోని పలు మఠాలకు ఆస్థాన విద్వాంసులుగా గౌరవంగా వ్యవహరించారు. కన్నడ ధార్మిక సాహిత్యంలో ఉత్తమ సేవలందించిన సర్వమూల మాసపత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు. ఆయన కృతులు ఎంతో పేరొందాయి. సాధకరిగొండు కివిమాతు, అదమారుమఠాధిపతి విశ్వప్రియ తీర్థ ఉపన్యాస సంగ్రహ విష్ణుసహస్రనామ టిప్పణి, ముఖ్యప్రాణ చింతనె, సువర్ణ సందేశ, వైష్ణవ సందేశ, వైష్ణవ దీక్ష, పాతివ్రత్య ప్రదీపికా తదితర రచనలు చేశారు. పలువురు మఠాధిపతుల ప్రవచనాలను ఆలకించి గ్రంథరూపంలో తెచ్చిన ఘనత ఆయనది. బెంగళూరు భండారకేరి మఠంలో విద్యేశతీర్థ 70వ వర్ధంతిలో శుక్రవారం ఉపన్యాసం చేసిన కొద్దిసేపటికే గుండెపోటుకు గురయ్యారు. రామాయణంలోని అంశాలను వ్యాఖ్యానం చేస్తూ 'దశావతరాలలో శ్రీరాముడు మాత్రమే అందరికీ ముక్తి కల్పిస్తారు...' అనే వాక్యం చివరిదికావడం గమనార్హం. గుండెపోటుకు గురైన ఆయనను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. చామరాజపేటలోని చితాగారంలో వందలాది విద్వాంసుల సమక్షంలో అంత్యక్రియలు జరిగాయి. ఉత్తరాది మఠాధిపతి సత్యాత్మతీర్థ, పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ, ఉడుపి ఫలిమారు మఠాధిపతి, భండారకేరి మఠం విద్యేశతీర్థ స్వామి తదితరులు రాఘవేంద్ర ఉపాధ్యాయ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు సద్గతులు పొందాలని కోరారు.

దర్శన్ కేసులో నిందితుడి తండ్రి మృతి

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గకు చెం దిన రేణుకాస్వామి హత్య విషయంలో సినీ నటుడు దర్శన్‌కు సాయం చేసేందుకు వెళ్లి అనిల్‌కుమార్ అలియాస్ అను అరెస్టు కావడంతో తండ్రి చంద్రప్ప (55) మృతి చెందారు. చిత్రదుర్గలో అనిల్‌కుమార్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. దీంతో హొళల్కెరె రోడ్డులో నివసించే తండ్రి చంద్రప్ప ఒక్కసారిగా ఇంటి వద్దనే కుప్పకూలాడు. తల్లి జయమ్మ రోదనలు మిన్నంటాయి. వయసుకొచ్చిన కొడుకు తన పని చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉండేవాడని, హత్యకేసులో అరెస్టు కావడంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. చంద్రప్ప శుక్రవారం పొద్దుపోయాక రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ ఒక్కసారిగా కుప్పకూలారు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఓవైపు కుమారుడు అరెస్టు కావడం, మరోవైపు భర్త మృతి చెందడంతో జయమ్మ తల్లడిల్లారు.

కుంటలో ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల మృతి

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): క్వారీ కుంటలో ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు నీట మునిగి మృతి చెందిన సంఘటన బెంగళూరు ఉత్తర తాలూకా బెట్టహలసూరులో చోటు చేసుకుంది. మొహమ్మద్ (18), ఉహేస్‌ఖాన్ (18) మృతి చెందిన యువకులు. స్నేహితులతో కలసి లాంగ్ డ్రైవ్‌కు వెళ్లిన ఆరుగురు యువకులు ఈత ఆడేందుకు క్వారీకి వెళ్లారు. ఈ సందర్భంగా ఈత రాక మునిగిపోతున్న ఓ యువకుడిని రక్షించేందుకు వెళ్లిన యువకులు తుదిశ్వాస వీడారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంది. శుక్రవారం సాయంత్రం ఒక యువకుడి మృతదేహాన్ని వెలికితీశారు. మరొక యువకుడి మృతదేహం శనివారం ఉదయం లభించింది. చిక్కజాల పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. యువకుల అకస్మిక మృతితో తల్లిదండ్రుల రోదన మిన్నంటింది.

ఎలక్ట్రికల్ బస్సు సేవలకు ఎన్‌వీఎస్ సహకారం

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, కార్పొరేట్ కంపెనీలకు అవసరమైన ఎలక్ట్రికల్ వెహికల్స్ బస్సులను సమకూర్చేందుకు ఎన్‌వీఎస్ ట్రావెల్స్ సొల్యూషన్స్ సహకారం అందిస్తోంది. బెంగళూరు కేంద్రంగా ప్రారంభమైన ఎన్‌వీఎస్ కంపెనీ మినీ బస్సులు, కార్లు, బస్సులను రూపొందిస్తోంది. ఇప్పటివరకు 900 ఎలక్ట్రికల్ బస్సులు కలిగి ఉండగా 500 బస్సులు సొంతంగానే పర్యవేక్షిస్తోంది. ఎన్‌వీఎస్ ట్రావెల్స్ సీఈఓ ఎన్‌వీ నాగరాజ్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులకు ప్రభుత్వ సాయం అందదని అందుకే బస్సుల ధర ఎక్కువ అన్నారు. పర్యావరణకు అనుకూలంగా ఉండేలా ఎలక్ట్రికల్ బస్సులను తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నామన్నారు. సుస్థిర రవాణాకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ సురేశ్ శెట్టియార్ పలు అంశాలను ప్రస్తావించారు. ఎలక్ట్రికల్ బస్సులతో పర్యావరణానికి ఎంతో మేలన్నారు. 2007లో కంపెనీ ప్రారంభించామని 32 నగరాలలో 800మంది సిబ్బందిని కలిగి ఉన్నామన్నారు.